# ఎంబార్ (గోవింద భట్టర్)



భగవద్రామానుజుల శిష్యులు ఎంబార్ (గోవింద భట్టర్). జ్ఞానవైరాగ్య సంపన్నులు. ఆచార్యసేవకే జీవితమును అంకితం చేసి మనకందరికీ ఆనందప్రాయులైన మహానుభావులు. గోవింద భట్టర్ చిన్నతనంలో రామానుజుల వారితో కలిసి యాదవ ప్రకాశకులు అనే అద్వైతవేదాంతి దగ్గర వేదాంత శాస్త్రాన్ని అధ్వయనం చేసేవారు. యాదవ ప్రకాశకులు రామానుజులు తన శిష్యడే అయినా, తాను చెప్పేవాటిని కాదని, తనకే అర్థాలు చెప్తున్నాడనే అసూయతో ప్రాణాలు తీయాలని ప్రయత్నం చేయడం పసికట్టిన గోవింద భట్టర్ రామానుజులను ఆ ప్రయత్నం నుండి తప్పించారు. రామానుజులు మనకు దక్కేట్లు చేసిన మహానుభావులు వీరే.

వీరి మనస్సు ఎప్పుడూ రామానుజులయందే లగ్నమై ఉండేది. ఒక వేశ్య తమ ఆచార్యులైన రామానుజుల గుణగుణాలను కీర్తిస్తూ పాటలు పాడుతూ నృత్యం చేస్తూ అందరిని ఆనందపరవశులను చేస్తూ ఉండేది. వీరు ప్రతిరోజు నదీస్నానానికి వెళుతూ ఆ వేశ్య ఇంటి ముందు ఆ పాటలు వినడం కోసం ఆగేవారు. ఇది అర్థంకాని కొందరు రామానుజులవారితో మీశిష్యుడు వేశ్య ఇంటి దగ్గర తిరుగు తున్నాడు అని చెప్పారు. రామానుజులు వారిని ప్రశ్నించగా, వారు స్వామీ! మీవైభవాన్ని ఎంతో గొప్పగా పాడుతూ నృత్యంచేస్తూ ఉంటే ఆ గానంతో నా మనస్సు పవిత్రం చేసుకోటానికే అక్కడకు వెళ్ళానని చెప్పారు. రామానుజులు వీరి ఆచార్య నిష్ఠకు ఆనందించారు. మనలాంటి వారికి వీరి ఆచార్యనిష్ఠ ఎంతైనా మార్గదర్శనం.
వీరు సంసార బంధములో చిక్కుకోక రామానుజులను ఆశ్రయించి, “నాకు సంసార జీవితం వద్దు. నేను మీకు దాసుడనై మీతోనే నా జీవితాన్ని గడుపుతాను, నాకు సన్యాసాశ్రమం ఇప్పించండి” అని ప్రార్థించిన జ్ఞానవైరాగ్య సంపన్నులు. గోవింద భట్టర్ ను పూర్తిగా అర్థం చేసుకున్న రామానుజులు

సన్యాసదీక్షను అనుగ్రహించి ఎంబెరుమానార్ అని పేరు పెట్టారు. కాని గోవింద భట్టర్ కంగారుపడి ఆ పేరు మీకే సార్ధకం స్వామి. ఆ నామం తలచిన వారికి మీరే గుర్తు రావాలి. అది ఇతరులకు తగదు అని ప్రార్థింపగా, పెట్టిన పేరు మార్చడం కుదరదు, కాకపోతే ఆ పేరులోని ముందు చివరలు కలిపి వ్యవహరించవచ్చు అని ఎంబ్ – ఆర్ = ఎంబార్ అని పిలిచారు. అలా గోవింద భట్టర్ ఆశ్రమ స్వీకారం చేసి ఎంబార్ గా ఆచార్య రామానుజుల సేవలో ప్రసిద్ధిగాంచారు.

**తిరునక్షత్ర తనియన్:**

పుష్యే పునర్వసు దినే జాతం గోవింద దేశికమ్ ।
రామానుజ పదామ్భోజ ద్వన్ద్వ ప్రవణ మానసమ్ ॥

**నిత్య తనియన్:**

రామానుజ పదచ్ఛాయా గోవిందా హ్వానపాయినీ ।
తదాయత్త స్వరూపాసా జీయాన్మద్వి శ్రమస్థలీ ॥

జైశ్రీమన్నారాయణ!